# స్వర్గంలో స్వాతంత్ర్యోత్సవం

✽

— శ్రీ కపిల కాశీపతి —

భారత స్వాతంత్ర్య ప్రభుత్వ పదవీస్వీకార కార్యక్రమం రాత్రిఅంతా రేడియోలో విని, కాస్త వోరగేసరికి కునుకుపట్టింది. ఆరుబయట చల్లని గాలిలో వొళ్లు తెలియలేదు. గోచరించింది ఇంతలో కళ్ల ముందు ఏదో బ్రహ్మాండమైన తేజస్సు. ప్రత్యక్షమైనాడు నారద మహాముని చేతులో వీణా, తనూ! ఆలోచిస్తున్నాను ఎల్లావర్ణించి వ్యాసం వ్రాతామా ఈ మహాముహూర్తంలో నాకు కలిగిన ఈ మహానుభవం అని.

" అది మహోదయము !

" అరుణ రేఖలలో, నల్లని కొండకనుమలవలె యేపుగా పెరిగిన దిరిసెనచెట్ల యెత్తుపల్లాలలో, చల్లని పిల్లతెమ్మెర లుయ్యాలలూగగా, తూరుపు వేటకాని కాంతిసూత్రముల యుచ్చులలో తగుల్కొన్న కోమల శిరీష కుసుమకన్యకావళి విరహ పరిమళాలలో మహతీ వీణాగానము మానవలోకానికి మేలుకొలుపులు పాడినది. మహర్షి, బ్రహ్మమానసపుత్రుడు, నాదబ్రహ్మోపాసకుడు, బ్రహ్మచారి, చిరంజీవి, త్రిలోకసంచారి, వార్తాసేకరణనిపుణశిరోమణి శ్రీ నారద మహాముని నా ముందు సాక్షాత్కరించిన మంచివేళ !

" అది శుభోదయము.

" కడచిన రాత్రి భారతవర్షము పరాధీన. ఈ వేళ ఉదయము స్వాధీన. అర్ధరాత్రివేళ, నా మాతృదేశానికి స్వాతంత్ర్యప్రదానం చేసిన శ్వేతజాతి, అరవై సంవత్సరాలుగా స్వాతంత్ర్య యజ్ఞంలో త్యాగదీక్షబూని సఫలమనోరథులైన నాదేశనాయకులు—వీరిలో ధన్యు లెవరు ? ఇచ్చినవారు ధన్యాత్ములు, పుచ్చుకున్నవారు ధన్యులు ! "

నారదమహాముని ఏకసంతగ్రాహి మాత్రమే కాదు. సర్వస్వాంతగ్రాహి. గ్రహించాడు నా వ్రాయసకాని బుర్రలో సుడిగుండాలులా గిరగిర తిరుగుతున్న పదజాలం. " సోదరా !" అన్నాడు. ఏమా మహాభాగ్యము ! నారదుడివంటి తేజోమూర్తి నన్ను "సోదరా" అని సంబోధించినాడే ! నాజన్మ పావనము. అవును. ఎందుకు కాకూడదు ? ఆంగ్లపరిభాషలో ఆయనా, నేనూ "ఏకైకపక్షులము." వార్తాప్రచార వృత్తిలో మేము సోదరులమే.

గ్రహించేశాడు అప్పుడే నారదమహాముని. "సరే, వ్రాసుకో" అన్నాడు. అసలు నారదుడికి కూడా తెనుగువొచ్చునని నాకు ఇదివరలో తెలియదు. వొకవేళ తెనుగువాడే యేమో! నేనుమాత్రం అడగలేదు. ఒకవేళ తెనుగొచ్చిన తమిళసోదరుడై నామీద అనుమాన పడతాడని. ఏమైనా "దేశభాషలందు తెనుగు లెస్స" అనడాని కిది మరో ఉదాహరణ. "ఎరుగవే బాసాడి ఎల్లఋషులు గొలువ."

నారదుడికి కాలునిలవడంలేదు. " వ్రాసుకోవేమి" అన్నాడు. రాత్రి పక్కనే పెట్టుకున్నాగావును, కలం, కాగితం తీశాను. ప్రారంభించాను వ్రాయడం.

"శ్రీమన్మహీమండలమండనాయమానంబైన భరతవర్షంబునందు" అని ప్రారంభించాడు. నాకు వొళ్లు మండింది. ఈ భాష ఎవడు వ్రాస్తాడు? నారదు డరేది, గీరదుడ యేది !

"అయితే, ఏ భాష కావాలి ? హిందీలోనా, ఇంగ్లీషులోనా ?"అన్నాడు.

"తెనుగువాడవై యుండి అదేమిటయ్యా, హిందీ వల్ల తెనుక్కి జరుగుతున్న అపకారం తెలియదా ? నువ్వు బ్రహ్మమానసపుత్రుడివని విన్నానుగాని, ఆంగ్ల

మానసపుత్రుడివని వినలేదే? ఇక వుండబట్టలేకపోయాను. ఋషి అయితేనేం, బుషిఅయితేనేం? తరవాత సంభాషణ అంతా ఏకవచనంలోనే జరిగింది. ఆయనకి కోపం వచ్చినట్టు మాత్రం లేదు.

"పదహారణాల ఆంధ్రుడివిరా నాయనా. ఏ భాషలో వ్రాస్తావు చెప్పు?"

"శిష్టులు మాట్లాడే తేటతెల్లమైన నా తెనుగు భాషలో."

"ఎవరా శిష్టులు?"

"అడ్డదిడ్డంవాదనే చెయ్యొద్దు. నీవంటివారు శిష్టులని నేను అంగీకరిస్తాను. కాని జాతీయం విడిచి పెడితే శిష్టులుకూడా పనికిరారు. నువ్వు పారిజాతాపహరణ సమయంలో రుక్మిణితోటీ, సత్యభామతోటీ ఏభాష మాట్లాడివున్నావో ఆ భాష చాలు. స్త్రీలలో ఇంకా జాతీయం చావలేదు. వారిదగ్గిర మనం నేర్చుకోవలిసింది చాలా వుంది."

"అళినీలాలక నీవు నీ పతి రహః
స్యక్రీడ వర్తించువే
ళ లతాంతాయుధ సంగర మునకు ను
ల్లాసంబు గల్పించు ను
జ్జ్వలదీపాంకురమై రతిశ్రమతనూ
సంజాతధారాళఘ
ర్మలవంబు ల్దొలగింపగా సురటియై
రంజిల్లు నిచ్ఛాగతిన్."

వీడి తస్సాదియ్యా! ఈ నారదుడు మహా పెద్ద పాటగాడండీ! ఎంత చక్కగా చదివినాడు ఆ పద్యం. వినివుంటే కామేశ్వరరావుగారు "పద్యం పాడగూడదు" అనేతమవాదన మార్చుకుని వుందురు. ఇంకా పాడమందా మనుకున్నాను, ముక్కుతిమ్మనముద్దుపద్యాలు—నానా సూనవితాన, జలజాతాసన, ఈసునబుట్టి, వామలోచన, ఇటువంటివి. ఆయనకూడా మాంచి మూడ్‌లో మాంచిపద్యం ఎత్తుకున్నాడు. బ్రహ్మచారి గదా, వీడికి రంజులన్నీ ఎల్లా తెలుసునో!

నవ్వుతున్నాడు నారదుడు. బుర్రలో బుద్ధి పుట్టేసరికే గ్రహించేస్తున్నాడు. వీడితో చిక్కే. అయితే లొంగకూడదు.

"అది ముక్కు తిమ్మన్నగారి భాషండీ పండితోత్తమా."

"భలే మంచి చౌకబేరమూ, ఇది సమయమూ,
మించినన్ దొరుకదూ"

అమ్మయ్యో! రామనాథశాస్త్రి ఎందుకు? వన్సుమోర్ అనేవాణ్ణే. కాని సంగీతచర్చ అప్రస్తుతం అనుకున్నాను.

"అది ముత్తరాజు సుబ్బారావుగారి భాష, మరి ఎవరి భాష. శిష్టులభాషమాత్రం కాదు."

"నిన్నొక్క విషయం అడుగుతాను చెప్పు. నీకంటే నేను గొప్పవాణ్ణి కాకపోయినా, నీకంటే వయస్సు నాకు ఎక్కువవుందని ఒప్పుకుంటావా?"

"తాటిచెట్టుకి లేవూ?"

"తాటిచెట్టు కంటే ఎక్కువ వయస్సుందా లేదా?"

"సరే, ఈ పాయింటు నీకిచ్చేశాను."

"భాష అనేది మనుషులతో పాటే మారుతూ వుంటుంది. సంస్కృతం మారలేదూ? ఎప్పుడు మారడం మానేసిందో అప్పుడే పోయింది లోకంలోంచి. ఒకనాటి శిష్టులు మరోనాడు భ్రష్టులౌతారు. "యథారాజా తథాప్రజా" అన్నారు. అసలు భాష అనేది ఒకర్ని ఒకరు అర్థం చేసుకోడానికి. సంభాషణకే కాక సాహిత్యానికీ, సంగీతానికీ వేరే వేరే భాషలు వుండవలసిన అవసరం ప్రతిదేశంలోనూ మనం చూస్తున్నాం. సాహిత్యానికి కొత్త సంస్కరించబడిన భాష అవసరం. సంస్కృతం అని పిలవబడే భాష వోనాడు కప్పల తక్కెడగా వుండేదే, పండితులంతా దాన్ని సంస్కరించి వోస్థాయిలో స్వరూపం ఏర్పాటు చేశారు. అల్లా సంస్కరించబడిన భాషే సంస్కృతం. అదే విధంగా తెనుగులో పద్యకావ్య భాష నన్నయభట్టూ, వచనకావ్యభాష వీరేశలింగమూ సంస్కరించారు."

"అయితే ఏమంటావ్?"

"ఏ యెండ కా గొడుగు పట్టుకోవాలంటాను"

"అంటే?"

"ఒకేరకమైన భాష వ్రాస్తానని మంకుపట్టు పట్టుకుని కూచోక నీ అవసరాన్ని అనుసరించి భాష అనే పనిముట్టు వుపయోగించుకోమని అర్థం. కట్టెలు కొట్టడానికి మంగలికత్తి ఉపయోగిస్తావా? పెన్సలు చెక్కడానికి వుపయోగించినా, కత్తిపీటతో గోళ్లు తీసుకోవుగదా? అదేవిధంగా భాష అనే పనిముట్టులో రకాలున్నాయి. నీకు ప్రస్తుతం కావలసినభాష పత్రికలలో రిపోర్టు చెయ్యడానికి పనికొచ్చేది."

"ఎందుకని?"

"నా రిపోర్టువ్రాయాలిగనక"

"ఇదోటా పైగా? నన్ను నిద్దరలేపి, నాతో వాదనవేసుకుని, పైగా రిపోర్టు వ్రాయమంటున్నావు. రేపురోజంతా ఎల్లాగావుంది రగడ"

"సోదరా!"

మళ్ళీ నా వొళ్లు పరవశమైపోయింది. ఆయన అల్లా బతిమాలుతోంటే ఎల్లా? పైగా తనూ, నేనూ నో వృత్తిలోనే వున్నాం. నాకష్టాలలాంటివే ఆయనకీ వుంటాయి వృత్తిలో.

"నిజం సుమా. గజేంద్రమోక్షం అప్పుడేమైంది?" అన్నాడు నారదుడు.

"సిరికిం జెప్పడు, శంఖచక్రయుగమున్ చేదోయి సంధింపడు."

"ఆయనసంగతి సరేనోయ్. తక్కినవాళ్లసంగతేమిటి? హమేషా యేలినవారి సమక్షంలో వుండవలసినవాళ్లం, విషయం ప్రకటించవలసిన నేనూ..."

"తనవెంటన్ సిరి, లచ్చి వెంట నవరో
ధవ్రాతమున్, దానివె
న్కను బక్షీంద్రుడు, వాని పొంతను ధనుః
కౌమోదకీశంఖచ
క్రనికాయంబును నారదుండు
... ... ..."

అవును మరిచేపోయాను. పాపం. అర్ధరాత్రివేళ. బ్రహ్మచారిప్రాణాన్ని...

"అల్లాగే ఇప్పుడూ జరిగింది. కనక నేనో రిపోర్టు చెబుతాను, వ్రాసుకో."

"అసలు భాషవిషయం తేలందే?"

"చెప్పానుగా, నీ ఇష్టం వొచ్చినభాషలో వ్రాసుకుని, అందరికీ అర్థం అయేటట్టు వ్రాయించు"

"ఓ. కే."

"సర్వజిత్తునామ సంవత్సర ఆధికశ్రావణ బహుళ త్రయోదశీ గురువారం రాహుయుత వృషభలగ్నమందు, భారతవర్షంబున ఇంద్రప్రస్థ నగరమునందు, శ్వేతద్వీపవాసులు కాంగ్రెసు నాయకులికి అధికార ప్రదానం చేస్తున్నారన్నవిషయం తెలుసుకుని, స్వర్గంలోకూడా, కీర్తిశేషులైన భారతీయులు, ఈ సందర్భంలో ఏదో కార్యక్రమం నడిపితీర్తారనే నమ్మకం కలిగి అక్కడికి వెళ్లితిని. స్వర్గద్వారంలోకే కోలాహలం వినబడింది, చూడగా జనంమాత్రం నేను అనుకున్నంతమంది లేరు."

"కారణం?"

"కనుక్కోగా తెలిసిందేమిటే అంటే, భూలోకంలో కీర్తిశేషులైన నాయకులంతా కొద్దిరోజుల క్రితం వరకూ స్వర్గంలోనే వున్నారనీ, బ్రిటిషుపార్లమెంటులో ఇండియాబిల్లు ఆమోదించబడిన నాడే మూటా, ముల్లే కట్టుకుని ఊర్ధ్వలోకాలికి వెళ్లిపోయారనీ తెలిసింది."

"అదేమిటి?"

"భూలోకంలోంచి, అస్తమించే కాలంలో, వ్యక్తులికి ఏవైనా తీరని కోరికలు వుంటే, ఆ కోరికలు తీరేదాకా మొదటి మకాం అయిన స్వర్గలోకం లోనే వుంటారు. అవితీరిపోగానే తక్కిన లోకాలికి పోతారు. ఈవిధంగా ఏడుమెట్లు వున్నాయి. అవే ఊర్ధ్వలోకాలు."

"ఇదివరదాకా వీరికి వుండుకున్నటువంటి కోరికలు ఏమిటి, ఇప్పుడు తీరినవి ఏమిటి?"

"భారత స్వాతంత్ర్యం!"

"ఆర్థికస్వాతంత్ర్య మను కాంక్షతోడనె నేగ గోపాలకృష్ణ గోఖలుండు.

—ఆ ఆర్థిక స్వాతంత్ర్యం వొచ్చిందా?"

"రాలేదు. కనకనే ఆయన ఇన్నాళ్లుగా స్వర్గంలోనే వుండిపోయాడు. ఇంకా వున్నాడు. సభకు వచ్చిన పెద్దలలో ఆయన వొకడు."

"ఇంకా ఎవరెవ రున్నారు ?"

"వాళ్లందరిపేర్లూ నేను చెప్పగలనా? నీకు కావలసినవాళ్ళ పేర్లు అడుగు, వున్నారో లేరో చెబుతాను."

"పూజనీయులైన పండిత మదనమోహన మాళవీయు లున్నారా?"

"ఏం, ఎవరికీ లేని గౌరవం ఆయనకి చూపిస్తున్నావు! పోయాడనా ?"

"మా కులపతి. గంగాతీరమందు కాశీక్షేత్రంలో పూజనీయులవద్ద నేర్చుకొన్న రెండుమాటలే నా చెవులలో మారుమోగుతూ వుంటాయి."

"ఏమి టవి?"

"నీకు తెలియనివి కావు. సత్యం వద, ధర్మం చర."

"ఆ సత్యం, ఆ ధర్మం ఈనాడు అమలులో లేవనే కొండంతబరువుతో పోయాడు. ఆబరువు మోస్తూ నడుంవొంగిపోయి, స్వర్గసీమలో పిచ్చివాడులా సంచరిస్తున్నాడు."

"ఇంక చెప్పకు, నాకు ఏడుపొస్తుంది. ఇంకా ఎవరున్నారు?"

"అడుగూ?"

"మోతీలాల్ నెహ్రూ వున్నాడా?"

"కొడుకు గాంధీకి వారసుడయాడని వినగానే వెళ్లిపోయాడు."

"ఆ సందర్భంలో మా కులపతి కోరికతీరలేదు."

"నాలుగోకొడుకు నేపాళ ప్రయాణంతో కాస్త ఆత్మశాంతి కలుగుతుంది లే."

"ఇంక దేవుడు చాలా మేలుచేస్తే, బాలగంగాధరతిలక్ వున్నాడా"

"ఆయన కర్మయోగి. పిచ్చిపిచ్చి కోరికలు లేకుండా ఆధ్యాత్మికంలోపడి ఆయన అప్పుడే వెళ్లిపోయాడు."

"తర్వాత, బెంగాలీ నాయకులూ?"

"ఆహా! అంతా వున్నారు. సురేంద్రనాథ్ బెనర్జీ మొదలు సుభాశ్చంద్రబోస్ దాకా."

"బోసు బతికుంటే స్వర్గంలో వున్నాడంటా రేం?"

"అక్కడా అనుమానంగానే వుంది. అసలు బోసా, నకలుబోసా అని. ఇంకా ఏమీ నిర్ధారణ కాలేదు."

"బెంగాలీనాయకు లేమంటారు?"

"వాళ్లు వేరే ప్రత్యేకసభ చేసుకున్నారు. ఎందుకోసమైతే భారతస్వాతంత్ర్యసమరం ప్రారంభం అయిందో, ఆవిషయంలోనే కాంగ్రెసు వోడిపోయిందన్నారు."

"అంటే?"

"బెంగాలు విభజనచేస్తానని లార్డు కర్జన్ అన్నప్పుడు ప్రారంభించిన వందేమాతరం ఉద్యమం ఈ సమరానికి అంకురార్పణం అంటారు. చివరికి బెంగాలు రెండుముక్కలై కర్జన్‌మాటే నెగ్గిందంటున్నారు. అందులో బిపిన్‌చంద్రపాల్ మరీనూ. దుమ్మెత్తిపోస్తున్నాడు నాలికకొరుక్కుంటూనూ."

"అవును పాపం. మరి మావాళ్ల సంగతేమిటి? వందేమాతరంలో మేమూ గంతులేశాంగా?"

"మీవాళ్ల సంగతి చెప్పడానికే వొచ్చాను. వీళ్లు కూడా వోప్రత్యేకసభ చేశారు."

"ఎందుకూ?"

"భారతదేశానికి స్వాతంత్ర్యం వొచ్చినా ఆంధ్రరాష్ట్రం రాలేదని."

"తప్పంటావా?"

"అన్నానా?"

"మరి?"

"విషయం నీతో చెబుదామని వొస్తే నామీద విరుచుకుపడతావేమిటి?"

"పడతానా, మరీ పడతానా? ఆంధ్రదేశమంటే అందరికీ వేళాకోళంగా వుంది. ఇంతవరకూ మాకు కాంగ్రెసు అధ్యక్షపదవి లేకపోగా, స్వాతంత్ర్యప్రభుత్వంలో స్థానం లేకపోగా, ఆఖరికి వోగవర్నరు పదవి కూడా మాకు లేకుండా చేశారు. విరుచుకుపడనూ!"

"అసలైన ఆంధ్రుడివిరా బాబూ, నువ్వు."

"కాకపోతే. చెప్పు. ఏం జరిగిందో. సర్వలోక ఆంధ్రవాసుల మహాసభ! ఆత్మశాంతిలేని ఆంధ్ర

నాయకుల అకుంఠిత దేశభక్తి! స్వర్గంలో మా ప్రత్యేక విలేఖరి! అంటే చాలా, పేరెయ్యమన్నావా?"

"పే రెందుకు లే?"

"సరే, సభలో వీరేశలింగంవున్నాడా?"

"ఆయనకాలంలో ఆంధ్రరాష్ట్రవాంఛ లేదు. సంఘసంస్కారి గనుక, ఏనాడు వితంతువివాహాలూ, జాత్యంతరవివాహాలూ ప్రారంభం అయాయో ఆనాడే ఆయనకి ఆత్మశాంతి. కాని వో విషయం చాలా బాధ పెట్టేది ఆయన్ని."

"ఏమిటది?"

"ప్రభుత్వోద్యోగులలో లంచగొండితనం పోవడానికి బదులు ఎక్కువ అవుతోందే అని."

"ఆయన విచారప డేంలాభం? మనిషి! ఈ కక్కుర్తి పెట్టిన నీ అబ్బ ననాలి. 'బ్రహ్మకైనను బుట్టు రిమ్మతెగులు' అన్నారు."

"అంతా ఆయన్ని తిట్టేవారే!"

"తిట్టరూ, బుద్ధితక్కువపనులు చేస్తోంటేనూ? అయితే మీ నాయన బాగా ముసిలివాడై పోయాడనీ, చిత్తచాంచల్యం ప్రారంభించిందనీ అంటారు నిజమేనా?"

"ఆ చాంచల్యానికే సృష్టి ప్రభావంఆపాదిస్తుంది. నువ్వు రిపోర్టు వ్రాసుకుంటావా, వ్రాసుకోవా?"

"సరేచెప్పు. వెంకటరత్నం నాయుడు గారున్నారా?"

"కాంగ్రెసేతరులికి స్వాతంత్ర్యసమరంలోగాని, తత్ఫలితాలలోగాని సంబంధం లేదు. వెంకటరత్నం నాయుడు కాకినాడలో అసహాయోద్యమ ప్రతికూల మహాసభకిఅధ్యక్షతవహించిన సంగతిమరిచిపోయావా?"

"అవును నిజమే. నాన్.కాంగ్రెస్ వాళ్ళపేర్లు ఎత్తొద్దంటావు."

"అన్నమాటే."

"చచ్చిపోయిన ఆంధ్రకాంగ్రెసు నాయకులసభ అందూ?"

"అల్లా అనడానికీ వీలులేదు. ప్రభుత్వోద్యోగాలూ అవీ చేసినవారు కూడా అక్కడున్నారు దేశభక్తి వో కాంగ్రెసు సొమ్మేనా?

"నువ్వేగా అన్నావు? అయితే మా గురజాడ వున్నాడా?

'దేశాభిమానం నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పుకోకోయ్
పూని, యేదైనాను వకమేల్
కూర్చి జనులకు చూపవోయ్!'"

"ఆయన లేకపోతే ఎల్లాగ గురజాడా, గిడుగూ జయంతివారితో భాషావాదం వేస్తున్నారు నీకు మల్లేనే. ప్రజలంతా మా పక్షం అంటారు గురజాడా, గిడుగూనూ. ప్రభుత్వం నాదీ అంటాడు జయంతి"

"స్వర్గానికెళ్ళినా సవితిపోరు తప్పలేదన్నట్టుంది. అసలు గిడుగు పిడుగు కాదంటే? పర్లాకిమిడి ఒరిస్సాలో కలిపితే లేచి వొచ్చేశాడు. ఆంధ్రాభిమానం అంటే ఆయనదే. అటువంటి సభకి ఆయన్నే అధ్యక్షుడుగా పెట్టవలసింది!"

"అది రాజకీయసభ అని మరిచిపోకు."

"అయితే ఈ పండితులెందుకు?"

"ఆంధ్రరాష్ట్రం వొచ్చేదాకా వీరి కోరికలూ తీరవు. కొమర్రాజు లక్ష్మణరావుగారు, చిలుకూరి వీరభద్రరావుగారు, వంగూరి సుబ్బారావుగారు, నడింపల్లి జగన్నాధరావు గారు, కొడాలి సుబ్బారావుగారు ఇత్యాదులు చాలామంది సదస్యులలోవున్నారు. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర పూర్తికాలేదని వొకరూ, అసలు ఆంధ్ర దేశచరిత్రే లేదని కొందరూ, అనేకవిధాల బాధపడుతున్నారు. ఇవన్నీ రాష్ట్రం వొస్తే తీర్తాయని వారి ఆశ."

"తర్వాత?"

"స్వర్గంలో ప్రత్యేకాంధ్ర నగరంలో ఆంధ్ర నాయకుల సభ ప్రారంభం అయింది. అసలు దేశభక్తి అనేది నవీనసాహిత్యంలో తీసుకొచ్చినవారు గనక, చిలకమర్తి లక్ష్మీ నరసింహంగార్ని పద్యాలతో సభ ప్రారంభంచెయ్యమన్నారు. సభలో ఎవరో ఆయన చిన్నప్పుడు వ్రాసినపద్యాలే చదవమన్నారు. లక్ష్మీనరసింహంగారు బరువుగా లేచి, చెన్నాప్రగడ భాను మూర్తిగార్ని ఆసరా చేసుకుని మెల్లిగా వేదికమీదికి వొచ్చారు."

"నువ్వెక్కడున్నావు?"

"ప్రతికావిలేఖర్ల స్థానంలో"

"ఓ. కే. అక్క డెవరెవరున్నారు?"

"యమలోకంనించి ప్రతినిధిగా వొచ్చిన చిత్రగుప్తుడున్నాడు."

"మావాళ్లోయ్?"

"చిర్రావూరి చింతామణిగారు, చిర్రావూరి సోమయాజులు గారు, ముట్నూరి కృష్ణరావుగారు, మున్నంగి శర్మగారు, చల్లా శేషగిరిరావుగారు, పులిగుర్తి లక్ష్మీనరసమాంబగారు ఇత్యాదులు"

"మరి నాగేశ్వరరావుగారూ ?"

"ఆయన్ని సభకి అధ్యక్షత వహించమన్నారు. ఆయన అంగీకరించలేదు. చివర నాలుగుమాటలు చెబుతామన్నారు. భగవద్గీత చేతులో పెట్టుకుని పారాయణ చేస్తున్నారు. ఆయన పక్కనే బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారూ, వెలిదెండ్ల హనుమంతరావుగారూ వున్నారు. ఆ పక్కని వరహగిరి జోగయ్యగారూ ఇత్యాదులు."

"చిలకమర్తివారు ఏ పద్యాలు చదివారు? 'భరతఖండంబు చక్కని పాడియావు' చదివారా?"

"కాదు, ఈ పద్యం:

నేలదున్నదుమన్న చాలతరము పన్ను
నీరుకావలెనన్న నీటిపన్ను
వాణిజ్య మొనరింప వచ్చుబడికి పన్ను
సరుకు లమ్మెదమన్న సంతపన్ను
కర్ర లమ్మెదమన్న కలప కింకొకపన్ను
పట్టణంబుల మునిస్పాలుపన్ను
పారిపోవుదుమన్న బండిహాసీల్ పన్ను
కొనపమ్మకొన్నచో స్టాంపుపన్ను
ఉన్నమట్టుకు తినకుండ నుప్పుపన్ను
నసెడు పన్నులు దిగదీసె జనులనెల్ల
కటకటా యెట్టులున్నదో కాపులదశ
సుగుణధనులార జనులార చూడరయ్య!"

"అయితే, స్వరాజ్యంలో పన్ను లుండవనా ఈయన అభిప్రాయం ?"

"అదే అడిగారుసభలో. తర్వాత భానుమూర్తిగారు గాంధీకంటే పూర్వం అసహాయోద్యమం ఎల్లా ప్రచారంచేశారో ఆ పద్యం చదవమన్నారు. అదేమిటంటే:

"దురుసుదనమున దీర దీ గడుసుదనము
గాన తాపులు పోటులు కార్య మనక
తెగలన్నిటి నేక మాలా గొనర్చి
నేర్పుతో తల్లి యెగజేప నేరవలయు"

"అంతేనేం. నాన్.వైలెన్స్ అప్పారావుగారు ప్రచారం చెయ్యలేదూ? "కత్తివైరం కాల్చవోయ్" అన్నాడు!"

"ఈ విషయమే సభాధ్యక్షుడు చెప్పాడు."

"ఆయనెవరు?"

"చీరాల రామదాసు"

"ఆయన్ని ఎందుకు అధ్యక్షుణ్ణిచేశారు?"

"ఒకరు చేసేదేమిటి? ఆయనే స్వయంగా పీఠం అలంకరించాడు.

నాగేశ్వరరావుగారు రానంటే వెంటనే గద్దె ఎక్కి:

మహాజనులారా, ఆంగ్రనాయకత్వం స్వర్గంలో కూడా మన పాలే బడింది. మహానందిలో కూడా ఇంతే. ఈనాడు భూలోకంలో భారతీయులంతా కోలాహలంగా స్వాతంత్ర్యోత్సవాలు చేస్తున్నారు. ఏడవాలో నవ్వాలో నాకు తెలియడంలేదు."

సభలో—"ఏడవలేక నవ్వాలి."

"చెయ్యగలిగితే మొదటిపనే చెయ్యి తమ్ముడా. నా అభ్యంతరంలేదు. కొంచెం దూరంగా వెళ్లిమాత్రం కానీ"

"ఒక్కమాటే ఇద్దరు చేస్తే ఎల్లా!"

"మహాజనులారా, రామాయణంలో ఇదో చిన్న పిడకలవేట్లాట. ఈనాడు భారతదేశానికి తెల్లవాడు వో అతుకుల బొంత వియ్యపరాలు రవిక ఇచ్చేసరికి అది కాస్తా వియ్యంకు లిద్దరూ తొడుక్కుని మురుస్తున్నారు. వోమాటు చిత్తరంజన్ దాసు మా గుంటూరు వొచ్చాడు."

జొన్నవిత్తులజగన్నాథం: "ఆ గుంటూరు మాది కూడాను"

"మన గుంటూరు వొచ్చినప్పుడు ఆయన ఇంగ్లీషులో ఉపన్యాసంచెయ్యడం, నేను తర్జుమా చెయ్యడమూనూ. దాసుగారన్నారు: బెంగాలు భారతదేశంలో ప్రప్రథమంగా స్వాతంత్ర్యదీక్ష వహించిందన్నాడు. నేను తర్జుమా చేశాను. 'మహాజనులారా! దాసుగారేదో కూస్తున్నాడు. వంగదేశం మానం

తప్పుకోకుండా అడవుల్లో తిరిగే రోజుల్లో ఆంధ్రదేశం మీసాలకి సంపెంగనూనె రాసినసంగతి ఈయన ఎరగడు.' సభవారంతా ఘొల్లున నవ్వారు. దాసుకి ఇది అర్థంకాలేదు. చెప్పొచ్చేదేమంటే, అసహాయోద్యమం, అహింసా అనే రెండు భావాలూ భారతదేశాని కిచ్చిన వారు ఆంధ్రులు."

"కాలేజీగోడలు దూకడంకూడా."

"ఉట్టి కెగర్లేనమ్మ స్వర్గానికెల్లా ఎగురుతుంది? గోడలు దూకితేనేగాని యుద్ధంలో కొండలు దూకడం రాదు. వీటిల్లో తరిఫీయదు చెయ్యడానికే నేను రామనగరంలో రామదండు స్థాపించింది. మళ్లీ దీక్షా సంఘాలు స్థాపించి, ఏకైకనాయకుడి శ్రీముఖంకింద ఆంధ్రులంతా పనిచేస్తే తప్ప ఆంధ్రరాష్ట్రం రాదు. మన్ని సుంకరకొండడని రెక్కరించిన కొక్కరాయిలంతా ఈనాడు ఏం చేశారు? ఇద్దరు గుజరాతీవాళ్లు దేశాన్ని నాశనం చేశారు: గాంధీ, జిన్నా. ఈ సమరంలో గెలుపొందినది ఎవరు? ముందు బ్రిటిషువారు, తరువాత జిన్నా. అప్రయత్నంగా జిన్నాకి స్వాతంత్ర్యం, సంస్థానాలకి స్వాతంత్ర్యం వొచ్చింది. మొన్నటిదాకా తమతో పూరేగిన సంస్థానప్రజలకి కాంగ్రెసువారిచ్చే సమాధానం ఏమిటి? తాము కడుపులో చల్ల కదలకుండా కూచుని, వాళ్ళని యుద్ధం చెయ్యమనడము ద్రోహము! ద్రోహము! కడుపుచించుకుంటే కాళ్ళమీద పడుతుంది. అసలు ఆంధ్రరాష్ట్రం ఇంతవరకూ ఎందుకు రాలేదో అనే విషయంమీద మన ఈడుపుగంటి రాఘవేంద్రరావు గార్ని మాట్లాడమని కోరుతున్నాను."

రాఘవేంద్రరావుగారు చిక్కిపోయి జబ్బుతో వున్నా వారి కంఠస్వరం గంభీరంగా వుంది.

"స్నేహితులారా! నేను ఆంధ్రదేశం విడిచిపెట్టి, మహారాష్ట్రదేశంలో జీవితం గడిపి, ఆ రాష్ట్రానికి సేవచేసే సందర్భంలో కాంగ్రెస్‌తో వివాదానికి వొచ్చినా, నాలో ఆంధ్రాభిమానం చచ్చిపోలేదు. కాంగ్రెసుకి అధికారంలేని రోజులలో గాంధీ టోపీతో గవర్నరు పదవి స్వీకరించిన భారతీయుణ్ణి నేను వొక్కణ్ణే. నా మర్యాదకి లోటు అని తోచినప్పుడు, నా ఆత్మస్వాతంత్ర్యం, నా దేశగౌరవం భంగపడేకాలం వొచ్చిందనుకున్నప్పుడు నా మంత్రి పదవికి నేను ఇరవైనాలుగుగంటలలో రాజీనామా ఇచ్చాను. నేను ఇండియా సెక్రటరీ సలహాదారుగా ఇంగ్లండు వెళ్లేటప్పుడు మద్రాసులో ఆంధ్రమహాసభవారు నాకు సన్మానంచేశారు. ఆనాడే చెప్పాను—ఆంధ్రోద్యమం నడకలో లోపాలు వున్నాయని. ఆ లోపాలు ఇంగ్లండు వెళ్ళినతర్వాత నాకు మరీ స్పష్టంగా కనబడ్డాయి. అసలు బ్రిటిషు ప్రభుత్వం ముందు ఆంధ్రులసమస్య లేనేలేదు. వెళ్లిన ఒకటి రెండు రాయబారవర్గాలవారూ ఏ ద్వారపాలకులో చూసి వొచ్చేశారు. కొందరు ఆంధ్రమహాసభని ఆశ్రయించి పెద్దపదవులు సాధించి తెనుగుతల్లిని విడిచిపెట్టేశారు. మద్రాసులో మొదటి కాంగ్రెసు మంత్రివర్గం వొచ్చినప్పుడే ఆంధ్రరాష్ట్రం మనకు కొంత సమీపంలోకి వొచ్చింది. కాని ఆ తరుణం జారిపోయింది. దానికి కారణం మీ అందరికీ తెలుసును. ఆ కారణం విషయమై విశాఖపట్నం సభలో తర్కవితర్కాలు, పత్రికలలో చర్చలూకూడా మీకు తెలిసిన విషయమే. ఈ విషయం ఎవరు బయటపెట్టి వున్నారా అనే సంగతి చాలామందిని బాధించింది. ఎవరెవరిమీదో అనుమానపడి, ఎవరెవరిచేతో వుత్తరాలు వ్రాయించారు. ఆ సంగతి బయటపెట్టింది నేను. కళ్లారా చూచివున్న సంగతిగనక ఇండియా రాజ్యాంగ ప్రణాళిక తిరగ వ్రాయడానికి ఇండియా కార్యదర్శి ఆఫీసులో వో నివేదిక తయారైంది. ఆ సంఘానికి నేనే అధ్యక్షుణ్ణి. అందులో ఇతర రాష్ట్రాలతోపాటు ఆంధ్రరాష్ట్రంకూడా రావాలని వ్రాయించాను. నాకు చూస్తేగా భారతీయసమస్య ఇకమీద భాషాసమస్యగా మారుతుంది. ముఖ్యంగా, మద్రాసు, బొంబాయి, మధ్యరాష్ట్రాలలో ఈ సమస్య తీవరిస్తుంది. ఇకనైనా ఆంధ్రులంతా ఏకమై ప్రయత్నిస్తే తప్ప ఇప్పుడు కూడా రాష్ట్రసాధన సామాన్యంకాదు. ఒరిస్సా ప్రజలు, కాంగ్రెసుతో పనిచేసినా, సైమనుకమీషను వొచ్చినప్పుడు తమ కేసు చెప్పుకున్నారు. ఇండియా ఆఫీసుని టెలిగ్రాములతో వూదరకొట్టి, తమ ఆశయం నెరవేర్చుకున్నారు. మరి మనమో? అధికారంలోకి వెళ్ళగానే రాష్ట్రంసంగతి మరిచిపోయాం. మంత్రులైనవారికి ఈ చిన్న రాష్ట్రం ఎందు కనిపిస్తుంది. ఈ సంకుచితభావాలవల్ల, స్వార్థంవల్ల, కాంగ్రెసుకి మనం వూడిగం చెయ్యడంవల్ల ఆంధ్రరాష్ట్రం ఈనాటికీకూడా రాలేదు. ఈ భావాలే నిలిస్తే ఇక ముందూ రాదు."

సభలో : షేం! షేం!

ఇంతలో సర్ బయ్యా నరసింహేశ్వర శర్మ గారు లేచి నుంచున్నారు.

"మహాజనులారా, బాపట్లలో జరిగిన ఆంధ్ర మహాసభలో ప్రప్రథమంగా ఆంధ్రరాష్ట్ర తీర్మానం ఆమోదించబడింది. ఈ సభకి అధ్యక్షతవహించే మహాభాగ్యం నాకు లభించింది. ఆనాటి నా వాంఛ, ఇన్నాళ్లుగా నా మాతృదేశపు వాంఛ ఇంకా తీరని కోరికగానే వుండిపోయింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో పెద్దలంతా తమ బిరుదావళి విడిచిపెడుతున్నారు. వారితో నేను ఏకీభవించి నా బిరుదావళి కూడా ఇంతటితో వొదిలేస్తున్నాను."

సర్ చిర్రావూరి చింతామణిగారు, రావు బహద్దరు తాడిపత్రి రాఘవాచార్యులవారు, రావు సాహెబు గిడుగు రామమూర్తిగారు, ఇత్యాదులు చాల్తామంది తమ తమ బిరుదావళి విడిచిపెట్టేశారు.

అప్పుడు జొన్నవిత్తుల జగన్నాథంగారి ముతా లేచి "ఈ సభలో ఆంధ్రరాష్ట్ర తీర్మానం ప్రతిపాదించి ఆమోదించా"లన్నారు.

ఆ సమయంలో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు లేచి నుంచున్నారు. సభవారంతా నిశ్శబ్దంగా వున్నారు.

"ఆర్యులారా! మనంఅంతా ఆంధ్రులం అన్న విషయం మరిచిపోలేకపోవడం సహజమే. మానవ ప్రకృతి పూర్వజన్మ పరిపాకముమీదనే ఆధారపడుచున్నది. కాని, మనము భారతీయులము కూడ ననే విషయము మరచిపోరానిది. తత్కారణముగా ఈ సభవారు ఆమోదించబోవు తీర్మానము వర్తమానకాల పరిస్థితులకు అనుగుణ్యముగా నుండవలెనను సంగతి సభవారు మరచి పోరానిది. భారతదేశస్వాతంత్ర్యము మనకు ముదావహ కారణ మనువిషయము ఈ సభా సమావేశమునందే గోచర మగుచున్నది. మహాత్ముని నాయకత్వముకింద యావదాంధ్రభూమి కూడి దేశ చరిత్రలో స్వర్ణపత్రము నలంకరించినది. అటువంటి చరిత్ర ఈనాడు మనము కళంకపరచరా దనువిషయము విబుధులకు విదితమే. సత్వరాంధ్రరాష్ట్ర సాక్షాత్కారము కాకపోవుట యావదాంధ్రులకూ విచారకరమైన విషయము. దీనికి లోటుపాట్లు మనలో లేక పోలేదు. కాని, భారత స్వాతంత్ర్య సమరములో నెటువంటి దీక్షతో ఆంధ్ర వీరులు ప్రవర్తించినారో, అట్టిదీక్షతోనే ఇకమీదఆంధ్రరాష్ట్రసాధనకొరకు ప్రయత్నించినచో ఆంధ్రరాష్ట్రము సాక్షాత్కారము కాగలదు. కాని, ఏది సాధించవలసినను, ప్రజ అర్హత సాధించవలసియున్నది. ఆ అర్హత మన స్వభావములో పరిణామము కలిగినప్పుడే రాగలదు. ఆంధ్రదేశ స్వభావము, ఆంధ్రప్రజ స్వభావము, ఆంధ్రనాయక స్వభావము మారవలసియున్నది. కేవల భౌతికదృష్టితో రాజకీయ విషయములు పరిశీలించినచో నిందులో నిసూక్ష్మము గ్రహింపరానిది. నైతిక దృష్టితో, లోకకల్యాణము కొరకు సాధనచేయు ప్రజానాయకులూ, ప్రజలే ధన్యాత్ములు. తాము చేయుకార్యములో స్వార్థచింత లేక, సంపూర్ణ విశ్వాసముతో పనిచేయువారికే కార్యసాఫల్యము కలుగును. వ్యక్తికివలెనే దేశమునకుకూడ ఈ నైతికదృష్టి యవసరమను విషయము వర్తమానకాల పరిస్థితులవలన విశదమగుచున్నది. ప్రజాస్వభావము మారనప్పుడే దేశస్వభావము మారుట ప్రకృతిధర్మము. ప్రజకు నైతిక దృష్టి యలవడిననాడే ఆత్మసాక్షాత్కారమగును. ఆంధ్రప్రజకు, ఆంధ్రదేశమునకూకూడ ఆత్మసాక్షాత్కారమగును గాక!"

ముట్నూరి ఆదినారాయణయ్యగారు: "ఆర్యులారా, నేను దేశోద్ధారకులవాదన బలపరుస్తున్నాను. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినందుకు మనకు సంతోషమే. కాని ఆంధ్రరాష్ట్రము రానందుకు విచారము. ఈ రెండు అంశములూ విశద పరుస్తూ, సభవారు తీర్మానం ఆమోదించవలెనని నా ప్రార్థన. బాపట్ల మహాసభలో తీర్మానం ప్రతిపాదించింది నేను. ఇక్కడ కూడా మీ అనుమతితో ఈ తీర్మానం ప్రతిపాదిస్తున్నాను—

'స్వర్గలోకవాసులైన ఆంధ్రులు శాలివాహన శక సర్వజిత్తునామ సంవత్సర చతుర్దశి శుక్రవారం ఉదయం సమావేశమై భారతదేశానికి స్వాతంత్ర్యం లభించినందుకు వారి ఆనందం వెల్లడిజేయుచూ, పరమేశ్వరుడికి ధన్యవాదాలు అర్పిస్తున్నారు.

భారతదేశ స్వాతంత్ర్యంతో పాటుగానే ఆంధ్రరాష్ట్రంకూడా రానందుకు సభవారు విచారము తెలియజేయుచున్నారు.

ఈ సందర్భంలో ఆంధ్రనాయకుల్నీ, భారతీయనాయకుల్నీ సత్వరాంధ్ర రాష్ట్రనిర్మాణము కొరకు సహాయపడవలసినదని కోరుతున్నారు.'

రాజా కొచ్చెర్లకోట వెంకటకృష్ణరావుగారు తీర్మానంబలపరిచారు. ఇతరులెందరో ఉపన్యసించిన తర్వాతతీర్మానం సభవారు ఏకగ్రీవంగా ఆమోదించారు."

అంటూనే నారదుడు వీణవాయించుకుంటూ ఎగిరి పోయాడు.

కళ్లు తెరిచేసరికి సూర్యుడు సూటిగా పొడుస్తున్నాడు.